శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

102

పదునెనిమిదవ అధ్యాయము - మోక్ష సన్న్యాస విభాగయోగము

39. యదగ్రే చానుబన్ధే చ సుఖం మోహనమాత్మనః
నిద్రాలస్య ప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్

వ్యాఖ్య : అతినిద్ర, సోమరితనము (బద్ధకము) ప్రమత్తత– అనువాని వలన కలుగునదియే తామస సుఖము. ఇది ఆరంభమునను, మధ్యమునను, అంతమునను గూడ జీవునకు మోహమును (అజ్ఞానమును, భ్రమను) గలుగజేయునదియే యగుటచే అత్యంత నికృష్టమైనది. ఇది జీవుని అజ్ఞాన కూపమున ఇంకను అధికముగ త్రోసివేయునది యగుటచే అత్యంత నికృష్టమైనది. ఇది జీవుని అతినిద్రతోను, సోమరితనముతోను గూడి అమూల్యమగు ఈ మానవజీవిత కాలమును వ్యర్థముగ గడిపి వేయువారు సంసార దుఃఖ సౌధ ప్రాంగణమున అడుగిడినవారేయగుదురు. జనన మరణ పరంపరారూపమగు ఈ సంసారమునకు హేతువైన అజ్ఞానరూపబీజము తామస సుఖాలవలంబులందు నశింపకయే యుండి ఇంకను బలపడుచుండునుగావున అట్టి సుఖము అత్యంత ప్రమాద జనకమైనది యగుటచే సర్వదా త్యాజమే యగును. కాబట్టి భగవానుని ఈ సద్బోధలను గ్రహించి ముముక్షువు లిట్టి తామసిక, రాజసిక సుఖముల రెండిటిని విడిచివేసి సాత్త్విక సుఖమునే అవలంభించి శ్రేయము నొందవలెను.

40. న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః
సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిస్స్యా త్త్రిభిర్గుణైః

వ్యాఖ్య : ముల్లోకములందలి ప్రతివస్తువున్ను సత్త్వరస్తమస్సులను ఈ మూడు గుణములతో గూడియుండుననియు, ఆ గుణములతో గూడియుండని వస్తువు (జీవన్ముక్తుడు తప్ప) ఏదియు ఈ ప్రపంచమున లేదనియు చెప్పుచున్నారు. జీవన్ముక్తులగు మహనీయులు తప్ప తక్కినవారందఱు ఏదియో యొక గుణముతోకాని, గుణములతో గాని గూడియున్నవారే. స్వర్గలోకములో నున్నవారున్ను త్రిగుణములతో గూడినవారేయనియు, వాని నుండి విడుదలపొందినవారు కాదనియు ఈ శ్లోకమున భగవానుడు చెప్పిరి. కాబట్టి వారున్ను బంధముననున్నవారే. వారున్ను ఎప్పటికైనను జ్ఞానాదులను బడసి గుణరహితులు, ముక్తులు కావలసియున్నారు.

'ప్రకృతిజైః'– అని చెప్పినందువలన ఈ మూడు గుణములలో ఏది యున్నను వారింకను ప్రకృతితో కూడియున్నవారేయని తాత్పర్యము. కావున రజస్తమస్సులను ప్రయత్నాతిశయముచేతను, అభ్యాసప్రాబల్యము చేతను దాటి సత్త్వగుణము యొద్దకు వచ్చి, క్రమముగా గుణాతీత ఆత్మస్థితిని బడయవలెను. అదియే మోక్షము.

41. బ్రాహ్మణ క్షత్రియవిశాం శూద్రాణాం చ పరన్తప!
కర్మాణి ప్రవిభక్తాని స్వభావ ప్రభవైర్గుణైః

వ్యాఖ్య : ఇదివఱలో 4 వ అధ్యాయమున 13వ శ్లోకమందు చాతర్వర్ణ్యములవారు వారి వారి గుణములను బట్టి కర్మలనుబట్టి సృష్టింపబడిరని భగవానుడు చెప్పియుండిరి. ఇప్పుడును ఆ భావమునే వ్యక్తీకరించుచు వారి వారి జన్మాంతర సంస్కారము వలన నేర్పడిన గుణముల ననుసరించియే వారివారికి ఆయా కర్మలు (వాని ననుసరించి ఆయా వర్ణములు) విభజింపబడినవని తెలియజేయుచున్నారు. దీనిని బట్టి పుట్టుకతోనే జాతి ఏర్పడుటలేదనియు, వారి వారి గుణములను బట్టియే జన్మ, కర్మలు ఏర్పడు చున్నవనియు స్పష్టమగుచున్నది. ఇట్టి పరిస్థితియందు ప్రతివానికిని ఊర్ధ్వస్థితికి బోవుటకు అవకాశము లభించుచున్నది. అనగా జన్మతా నీచజాతియందు పుట్టినప్పటికి తమ తమ కర్మల యొక్క శుద్ధత్వముచే, పారమార్థిక సాధనాతిశయముచే, పవిత్రతచే ఉత్తమవర్ణస్థులుగా తయారు కావచ్చును. ఈ ప్రకారముగ సర్వులకును ఆధ్యాత్మిక ఉన్నత శిఖరముల నధిరోహించుటకు అవకాశములు కల్పించుట గీత యొక్క ఒకానొక విశిష్టతయై యున్నది.

42. శమో దమ స్తపశౌచం క్షాన్ని రార్జవమేవ చ
జ్ఞానం విజ్ఞానమా స్తిక్యం బ్రాహ్మ కర్మ స్వభావజమ్

వ్యాఖ్య : జ్ఞాన, విజ్ఞానముల రెండిటిని ముముక్షువు తప్పక గలిగియుండవలెనని భగవానుడు గీతయందు పెక్కుతావుల పేర్కొనుచున్నారు. కేవలము శాస్త్రజ్ఞానము చాలదు. అనుభవము గూడనుండవలెను. అనుభవమువలననే మనుజునకు హృదయపరిణామము, ఆనందము కలుగుచుండును. మఱియు జనులకు పరమార్థ విషయములపై విశ్వాసమున్ను ఉదయించుచుండును. కాబట్టి ప్రతివారును శాస్త్రజ్ఞానముతోబాటు అనుభవజ్ఞానమున్ను సంపాదించవలెను. ఈ శ్లోకమున శమదమాదులను తొమ్మిది కర్మలుగా చెప్పబడియున్నవి. ఆ సత్కర్మల ననుష్ఠించువాడు బ్రహ్మణుడే యగునని భావము. ఇచట 'తపస్సని' చెప్పబడినదాని కర్థము 17వ అధ్యాయమున తెలుపబడిన శారీరక, వాచిక, మానసిక తపస్సులే యని గ్రహించు నది.

(తరువాయి వచ్చే సంచికలో)

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

Lovely Stay at Holy Tirupathi   The Gateway of Lord Balaji

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

పరమ పూజ్యులూ, పవిత్రమూర్తులూ, మహాపండితులు, గురువరేణ్యులు మంత్రాలయ పీఠాధిపతులు

శ్రీశ్రీశ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదులవారు!

మంత్రాలయ శ్రీరాఘవేంద్ర మహాపీఠంతో నాకు రెండున్నర దశాబ్దాల పైచిలుకు భక్తిభావం ఉన్నది. నా శ్రేయోగాములూ ప్రసిద్ధ పారిశ్రామికవేత్త, సుహృదయులైన శ్రీమాన్ టి.జి. వేంకటేష్‌గారు తమ కారునిచ్చి పంపగా తొలి దర్శనం చేసుకున్నాను. ఎమ్మిగనూరులోని ఎం.జి. బ్రదర్స్ కంపెనీవారు మనిషిని తోడిచ్చి పంపగా మరొకసారి దర్శనం చేసుకున్నాను. అక్కడ కార్యాలయ యాజమాన్యం వారితో గల ప్రేమాభిమానాలు సంపాదించి అనేకానేక పర్యాయములు రాఘవేంద్ర మఠ దర్శనం చేసుకుంటూ, పారం పర్యంగా వచ్చే పీఠాధీశుల దర్శనమూ, ఆశీస్సులూ, శేషవస్త్ర బహుమానం పొందుతూ వచ్చాను. భోజనశాలలో గౌరవాతిథుల కిచ్చే భోజనశాలలో ప్రత్యేక ఆదరణంతో భోజన ఫలహారములను భుజించేంతటి ఆప్యాయతలను సంపాదించాను.

అప్పుడు అపార ప్రేమాభిమానాలు చూపించే బహుభాషా పండితుడూ, సదా చిరునవ్వులు కురిపించే – మహాభాగునితో భాషించడం సాక్షాత్తూ రాఘవేంద్రునితో మాట్లాడిన అనుభూతి కలిగింది. వారిపై వాత్సల్య భక్తి కలిగింది. వారి ముఖ కవళికల్లో రాఘవేంద్రుని దర్శించిన అనుభూతి కలిగింది. ఆయన మంత్రాలయ పీఠాధీశులు కాగలరనే పూర్ణ విశ్వాసమూ జనించింది. రాఘవేంద్రస్వామి కున్నంత వర్చస్సు ఆయన ముఖబింబంలో ద్యోతకమైంది. బృందావనములోని రాఘవేంద్రులు ఆశీర్వదిస్తూనట్లొక అనుభూతి కలిగింది. ఆ ముఖ కవళికల్లో రాఘవేంద్రుని తేజస్సూ, పాండిత్యమూ, వీక్షించిన నేను ఆయన భవిష్యత్పీఠాధిపతులు కాగలరని విశ్వసించాను. నా విశ్వాసం నిజమైంది. ఈ అపర రాఘవేంద్రుల పాదయుగళికి శిరసా నమామి అంటున్నాను. ●

మా వాడే గోటేటి

– పి.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి

సినిమాలను తీసినాడు పత్రికలలో చేసినాడు
కష్టనష్టములను దాచెను మిట్టపల్లములు చూచెను
పరిస్థితుల నెదిరించెను మేరుధీరుడై నిలిచెను ॥ప్రముఖాంధ్రుడు॥

ఆతని దొక బాణి ఆతని దొక వాణి
నిర్భీతుడు నిర్మలుడు నిజాయితీ కలవాడు
ధనమునకు దౌష్యమునకు లొంగనట్టి విలేఖరి ॥ప్రముఖాంధ్రుడు॥

రామాయణ కథాసుధను వ్రాసెను వచనమ్ములోన
జగదభిరామము పలికెను జగతికి వెలుగులు జిమ్మెను
చదువుల సారంబైన ఈశ్వరం సర్వభూతానం
తెలిసి వలచి వర్తించెను ప్రేమతోడ నర్తించెను ॥ప్రముఖాంధ్రుడు॥

కుంతల నవలను మెచ్చిరి పీఠాధిపులైన వారే
గోటేటి గీతమ్ముల అనుభవ సారము నింపెను
విద్యావిశారదుడే అనుచు రచనల విలువలు పెంచెను ॥ప్రముఖాంధ్రుడు॥

మానవతా మహనీయుడు మా వాడే గోటేటి
సంపాదకమండలిలో సాహసవీరుడు మేటి
శ్రీరాముడు ధీరాముడు ప్రపంచాంధ్ర అభిమానుడు ॥ప్రముఖాంధ్రుడు॥

సహస్రచంద్ర దర్శనోత్సవ గుణసాంద్రుడు గోటేటి
ఆత్మీయత పంచిపెట్టు అఖిలాంధ్రుడు గోటేటి
ప్రముఖాంధ్రుడు గోటేటి ప్రబలు శతవత్సరములు ॥ప్రముఖాంధ్రుడు॥

ఉత్సాహము ఆరోగ్యము ఇబ్బడి ముబ్బడి కాగా
పదికాలా లాంధ్రులకు పథమును చూపించుగాక!
ప్రముఖాంధ్రకు విలువపెంచు ప్రముఖుండై వెలుగుగాక!
విజయుండై నిలుచుగాక! ॥ప్రముఖాంధ్రుడు॥

Compliments from

Sri Krishna Bhat

When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala

WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

ధర్మవరం పట్టుచీర

నిరంతర ప్రయోగాలతో, ముతకబట్టగా ముద్రపడ్డ చేనేత వస్త్రాలను ఆధునిక అలంకార వస్త్రాలుగా ధర్మవరం చేనేత కార్మికులు మెప్పించగలిగారు.

పట్టుచీరకు పెట్టింది పేరు ధర్మవరం. అనంతపురం జిల్లా ధర్మవరంలో చేనేత మగ్గాల మీద నేసే పట్టు వస్త్రాలు అత్యంత నాణ్యమైనవి. దశాబ్దాలుగా శుభకార్యాల్లో ధర్మవరం పట్టు చీరలు ధరించడం ఒక సంప్రదాయం. అయితే అవే రంగులు, అవే మామిడి పిందెలు, అవే లతలు, అవే దీపాలు.. కట్టుకునే స్త్రీలకు విసుగేయడం సహజమే. ప్రింట్‌తో పోటీపడే డిజైన్లు సృష్టించాలి. లేత రంగులు రాబట్టాలి. ఒకే చీరలో పలు వర్ణాలు ప్రతిబింబించాలి. ఈ మార్పులు ధర్మవరం యువ నేతకార్మికులు కొందరు విజయవంతంగా సాధించారు.

ఇటీవల ఆవిష్కరించబడ్డ పంచవర్ణాల చీర సృజనకారుడు పెద్దయ్యగారి మోహన్ తాము చేనేతలో చేస్తున్న ప్రయోగాలు గురించి వివరించారు. మూడు తరాలుగా ఈ కుటుంబం చేనేతలోనే ఉంది. తాత పెద్దన్న, నాన్న పురుషోత్తం చేనేత కార్మికులే. పురుషోత్తం ముగ్గురు కొడుకులు కూడా చేనేతనే వృత్తిగా ఎంచుకున్నారు. చేనేతలో నిరంతరం కొత్తదనం కోసం కృషి చేస్తున్నారు. పట్టు వస్త్రానికి మార్కెట్ ఉంది. అయితే డిజైన్లలో ఆధునికత ఉండాలి. కొత్త డిజైన్‌లు నేయగలిగితే నేత కార్మికులకు దిగుల్లేదు అంటారు మోహన్. ఆ ఉద్దేశ్యంతోనే 17 రకాల ఆధునిక పట్టు చీరలను నేసి చేనేత మార్కెట్‌ను నివ్వెర పరిచారు. ఈ చీరల నేతకై ప్రత్యేకంగా 16 మగ్గాలను వినియోగిస్తున్నారు. ఒకే రకమైన చీరలు నేసుకుంటూ వెళ్లడం లేదు. చీర చీరకీ ప్రత్యేకత చూపించాలనే తపన వేరు. ఈ తపనే చిత్రవిచిత్రమైన చీరలకు ప్రాణం పోసింది. 'సంపంగి పట్టు చీర నేయడానికి పూల సేకరణకి శేషాచలం కొండల్లో మేం పడిన అవస్థ అంతా ఇంతా కాదు. మా శ్రమకి ప్రతిరూపంగా ఉన్న చీర అందాన్ని చూసి ఆంధ్ర జ్యోతి నిర్వాహకులు వేమూరి రాధాకృష్ణ చలించిపోయారు. మా ప్రతిభను లోకానికి చూపారు. తత్ఫలితంగా చీరకి జాతీయ అవార్డు లభించింది అని చెబుతున్న మోహన్ కళ్లలో సంపంగి పూల కాంతి కనిపించింది. ఈ చీరల వెల 35 నుండి 40 వేల రూపాయల దాకా ఉంటుంది. ఆధునిక ప్రయోగాలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఇంకా పెరగాలంటారు మోహన్. ఈ కాలపు మహిళలు నచ్చే, మెచ్చే డిజైన్లను రూపొందించగల ప్రతిభగల డిజైనర్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర సర్కారు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. యువ డిజైనర్లకు చేయూతనివ్వాలి. నేతన్నలను కొత్త వైపు మళ్లించే దిశగా జౌళిశాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాలి అంటారు ఈయన. ఇటువంటి ప్రయత్నాలు చిత్తశుద్ధితో చేస్తే చేనేతలో ఆత్మహత్యలకు చోటే ఉండదని చెబుతారు.

పంచవర్ణాల పట్టుచీర : ఈ చీర మీది డిజైన్ రంగురాళ్లు పొదిగారు. నిజమైన తులసి పూసలు, నెమలి ఈకలు కూడా చీర డిజైన్‌లో అమర్చారు. సూర్యకాంతిని స్వీకరించే ఈ చీర చీకట్లో కూడా మెరిసిపోతుంది. కాంతికి అనుగుణంగా మారే రంగురాళ్ళ మెరుపుల వల్ల చీర రంగులు మార్చుకుంటున్నట్టుగా కనిపిస్తుంది. ఇటీవలే తిరుపతిలో ఈ చీరను విడుదల చేశారు.

బ్రహ్మకమలం : మే, జూన్ నెలల్లో అరుదుగా కనిపించే పుష్పం బ్రహ్మకమలం. ఈ అరుదైన పువ్వును పట్టుచీర మీదకు తీసుకురావాలనుకున్నారు ధర్మవరం మోహన్. అందుకు అనువైన సాంకేతిక మార్పులు మగ్గంలో చేసుకున్నారు. అచ్చం బ్రహ్మకమలం లాగే ఉండే పువ్వును పట్టు వస్త్రం మీద పట్టునూలుతో అనేక ప్రయత్నాల తర్వాత సాధించారు. ఒకే చీర మీద 20 బ్రహ్మకమలాలను పొదిగించి అద్భుతమైన చీర నేశారు. దీనికి బ్రహ్మకమలం పట్టుచీర అనే పేరు పెట్టారు. మార్కెట్‌లో ఈ చీరకు మంచి స్పందన లభించింది.

సంపంగి పువ్వు : అడవి సంపంగి పువ్వు అందమే వేరు. సువాసనలు వెదజల్లుతూ ఉంటుంది. సాధారణంగా పసుపు, ఆరెంజ్ రంగుల్లో దొరుకుతాయ్. అరుదుగా తెల్ల సంపంగి పూలు పూస్తాయి. అటువంటి సంపంగి పువ్వులను శేషాచలం అడవుల నుంచి సేకరించి వాటి నుంచి తీసిన గుజ్జుల్లో రేషం దారాన్ని ఉడికించి, ఆ దారంతో సంపంగి పట్టుచీరను నేశారు. ఇది బ్రోకెన్ శారీ తరహాలో ఉంటుంది. అప్పట్లో ఈ చీరను ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి







రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ చీరకి మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ నుంచి 2009లో జాతీయ అవార్డు లభించింది.

స్వరమాధురి : కంటికే కాదు చెవులకీ ఇంపైన చీర ఉంటే ఇంకెంత బావుంటుందో అనే ఆలోచన స్వరమాధురి చీరకు ప్రాణం పోసింది. ఎన్నో ప్రయోగాలు. ఈ చీర నేయడానికి మోహన్‌కి మూడేళ్ళు పట్టింది. ఈ చీరలో సూక్ష్మపరిమాణంలో స్పీకర్ అమర్చారు. కొంగుభాగంలో చిన్న స్విచ్ ఉంటుంది. దానిని నొక్కిన వెంటనే సంగీతం వినిపిస్తుంది. ఆ చీర ధరించిన మహిళకు మాత్రమే స్వరం వినిపించే విధంగా ఏర్పాటు చేశారు. ఈ స్వరంలో గణపతి సచ్చిదానంద ట్యూన్ వినియోగించారు. పూజలు, నోములు వంటి కార్యాలకు హాజరయ్యే సమయంలో ధరించడానికి అనువైన చీర ఇది. స్వరాలు పలికే చీర గనుక స్వరమాధురి చీర అని పేరు పెట్టారు. ఈ పట్టుచీరకు 2010లో రాష్ట్రస్థాయి అవార్డు లభించింది.

శిల్పకళ పట్టుచీర : లేపాక్షి శిల్పాల స్ఫూర్తితో పురుడుపోసుకున్న చీర. లేపాక్షిలో 15 శతాబ్దానికి చెందిన ఒక శిల్పం మోహన్‌ని ఆకట్టుకుంది. ఏనుగుముఖం, సింహం శరీరంగల శిల్పం అది. బలానికి ఏనుగు, పౌరుషానికి సింహంప్రతీకలు. పట్టుచీర మీద ఈ శిల్పాన్ని నేశారు. దీనికి శిల్పకళా పట్టుచీరగా పేరుపెట్టారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో ఈ చీర చోటు చేసుకుంది.

మయూరి పట్టుచీర : నెమలి ఆకారం చీర మీద నేయడంలో కొత్తదనం లేదు. అయితే చీర మీద ఉండే నెమలి బొమ్మలో నిజం నెమలీకలనే నేతలో పొందుపరిచారు. మెరిసే నెమలి కన్ను కోసం వారణాసి నుంచి ప్రత్యేక రాయిని తెప్పించి పెట్టారు. ఈ చీర ప్రత్యేకత ఏమంటే కట్టుకున్నప్పుడు ఈ చీరమీద ఉండే నెమలి మొత్తం కనిపించడం.

నవరత్న పట్టుచీర : నవరత్నాలు పొదిగి పట్టుచీరలు భారతదేశంలో 15, 16 శతాబ్దాలలో నేశారని చెబుతారు. ఇన్నాళ్లకవి మళ్లీ ధర్మవరంలో తయారయ్యాయి. అమెరికన్ డైమండ్స్, కనక, పుష్యరాగం, ఇంద్రనీలం, పచ్చ, గోమేధికం, కెంపు, ముత్యం, పగడం వంటి నవరత్నాల కలయికతో చీర నేశారు. ఒకే చీర మీద 41 రత్నాలుంటాయి. నవరత్న పట్టుచీరకి మంచి స్పందన వచ్చింది. కేరళీయులను ఇవి విశేషంగా ఆకట్టుకున్నాయి.

కళ్యాణకాంతి : వివాహ ముహూర్త సమయంలో పెళ్ళికూతురు కట్టుకోవడం కోసమే నేసిన చీర ఇది. కొంగుభాగాన ముత్యాలతో శ్రీరస్తు శుభమస్తు అనే అక్షరాలు కనిపిస్తాయి. పెళ్లి కుమార్తెను ముత్యాలపందిరిలో తీసుకెళ్తున్న దృశ్యం ఉంటుంది. ఇందుకోసం 60 గ్రాముల ముత్యాలు వినియోగించారు. చామంతి ఆకారంలో కంఠాభరణం, చీర నడుము భాగంలో 50 గులాబీలు స్వచ్ఛమైన సువాసన వెదజల్లే విధంగా ఈ పట్టుచీరను నేసి మార్కెట్‌లోకి విడుదల చేశారు.

పద్మవర్షిణి : పచ్చ, గులాబీ, నీలిరంగుల్లోకి మారే చీర ఇది. వాతావరణాన్ని బట్టి రంగు మార్చుకుంటుంది. ఇలా రంగులు మారేలా వేషాన్ని కనిపెట్టి ఈ చీర నేశారు. చీరమీద రకరకాల పద్మపుష్పాలుంటాయి. కొంగు భాగాన రకరకాల పుష్పాల మేళవింపుతో కూజాభాండారం ఉంటుంది. రంగులు మార్చే ఈ చీరకు పద్మవర్షిని అని పేరు పెట్టారు.

శ్రీగంధం శారీ : పట్టుచీరపై శ్రీగంధాన్ని మేళవించి మరో అద్భుతమైన చీరకు శ్రీకారం చుట్టారు. లేపాక్షి ఎంపోరియం నుంచి శ్రీగంధం చెక్కలను తెప్పించుకుని స్వర్ణకారులచే మామిడి, తామర పుష్పం, గులాబీ పుష్పాలను తయారు చేయించి ఈ పట్టుచీరలో డిజైన్ చేయించారు. తమిళనాడులో ఈ చీరకు విశేష స్పందన లభించింది.

లైటింగ్ శారీ : పదవతరగతి సైన్స్‌ఫెయిర్‌లో ఎలక్ట్రికల్ లైటింగ్ కాన్సెప్ట్‌తో తయారు చేసిన అనుభవంతో మోహన్ ఈ వెలుగుల చీరను నేశారు. సన్నని వెంట్రుకవాసి తీగలు చీరలో కలిపి నేశారు. ఈ తీగలకు 20 సన్నని బల్బులు అమర్చారు. చీరలోనే దాగిన 9 ఓల్టుల బ్యాటరీతో ఇవి పనిచేస్తాయి. మూడు గంటల వరకు ఈ చీర వెలుగులు విరజిమ్ముతుంది.

–కవటూరి ప్రసాదరావు, జి.వి. నారాయణరావుకు కృతజ్ఞతలు

70 ఏళ్లలో టెలికాంలో వచ్చిన మార్పులు

వేరే ఊళ్లో ఉన్న మీ వాళ్ళెవరితోనైనా మాట్లాడాలి.. ఏం చేస్తాం? జేబులో ఉన్న స్మార్ట్ ఫోన్ తీసుకుని.. చిటికెలో కాల్‌చేసి మాట్లాడుతాం. అదే మనకు స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో మన వారెవరితోనైనా మాట్లాడాలంటే గంటలు గంటలు వేచి ఉండాల్సి వచ్చేది. ముందుగా టెలిఫోన్ ఎక్స్ఛేంజికి ఫోన్ చేసి అవతలి వారి నంబర్‌కు ట్రంకాల్‌బుక్ చేయాల్సిందే. అక్కడుంటే ఆపరేటర్ అవతలివైపు వారికి లైన్ కలిపి, తిరిగి మనకు ఫోన్ చేసేవారు. తర్వాత కాలంలో డయల్ చేసి మాట్లాడగలిగే ఆటోమేటిక్ ఎక్స్ఛేంజీలు ఏర్పాటయ్యాయి. ఇక టెలిఫోన్ అనేది అప్పట్లో ఓ పెద్ద స్టేటస్ సింబల్. దానికోసం బోలెడన్ని డబ్బులు చెల్లించాల్సి వచ్చేది. టెలిఫోన్ల విస్తృతి కొంచెం పెరిగాక... ఎస్టీడీ బూత్‌లు వచ్చాయి. తర్వాత కార్డ్‌లెస్ టెలిఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. ల్యాండ్‌లైన్ టెలిఫోన్ వైర్‌లెస్ రిసీవర్‌ను పట్టుకుని కొద్ది దూరం తిరుగుతూ మాట్లాడడం అప్పట్లో ఫ్యాషన్‌గా మారింది. ఆ తర్వాతి కాలంలో పేజర్లు వచ్చాయి. ఇక 1990వ దశకంలో మొబైల్ ఫోన్ల రాకతో టెలికాం విప్లవం వచ్చింది. అయినా నాలుగైదు కిలోల బరువు పెద్ద ఇటుక పరిమాణం మొబైల్ ఫోన్లు, అత్యధిక ధరల కారణంగా ప్రజల్లో పెద్ద ఆదరణ లభించలేదు. 2000వ దశకంలో నోకియా, మోటరోలా కంపెనీలు మొబైల్స్ తయారీలోకి దిగగానే మొత్తంగా మొబైల్ ఫోన్ల చరిత్రనే మార్చేసింది. మొబైల్స్ వచ్చిన తొలినాళ్లలో ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ రెండింటికి డబ్బులు కట్టాల్సి వచ్చేది. తర్వాత మొబైల్ సంస్థల్లో పోటీ తీవ్రమై.. మొబైల్ వినియోగం అత్యంత చవకగా మారిపోయింది. ఇన్‌కమింగ్ పూర్తిగా ఉచితం కావడంతోపాటు ఔట్‌గోయింగ్ కాల్స్ ధరలూ బాగా తగ్గిపోయాయి. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న వారికి ఒకేసారి ఫోన్‌చేసి, అందరూ కలిసి మాట్లాడుకునేలా 'కాల్ కాన్ఫరెన్స్' సదుపాయమూ వచ్చింది. టెలికాం రంగంలో అనేకమార్పులకు మనవాడు డా॥ త్రిపురనేని హనుమాన్‌చౌదరి ముఖ్య కారకుడు.



అనాథుడెవడూ ఉండడు!

పరుపు మీద దిండుకు వెనక్కి ఆనుకుని కూర్చుని ఉన్నాడు విశ్వనాథరావు. సూర్యాస్తమయం అవుతున్నట్లుగా ఆకాశం అంతా ఎరుపు రంగు పూసుకుంది. కిటికీలో నుంచి చూస్తున్నాడు. తన చిన్నప్పుడు సూర్యాస్తమయమయ్యే సమయానికి పక్షులు కోలాహలంగా గూళ్లను చేరుకుంటూ కనిపించేవి. మరో పక్కన కొంగలు బారులు బారులుగా ఎగిరిపోతూ కనిపించేవి. ఇప్పుడు ఈ మహాపట్నంలో చెట్లూ లేవు, పక్షులూ లేవు. చెరువులూ లేవు, కొంగల గుంపులు అసలే లేవు. ఎనిమిదో అంతస్థులో ఉన్న అపార్ట్‌మెంట్ అది. పైన మరో రెండు అంతస్తులున్నాయి. దిగిపోతున్న సూర్యుణ్ణి చూడాలంటే కాంపౌండ్ వాల్ దగ్గరకొచ్చి, తలవంచి చూడాలి.

కిచెన్‌లో ఉన్న సింక్‌లో గిన్నెలు కడుగుతున్నాడు రంగయ్య. నిశ్శబ్దంగా ఉన్న ఆ పరిసరాలలో ఆ మోత చెవి దగ్గర చేస్తున్నట్లు కర్ణకఠోరంగా ఉంది.

"రంగయ్యా" అని పిలిచాడు విశ్వనాథరావు.

"అయ్యా" అంటూ వచ్చాడు రంగయ్య.

"కుర్చీ వరండాలో వెయ్యి. కాసేపు బైట కూర్చుంటాను" అన్నాడు. రంగయ్య కుర్చీ తీసుకువెళ్ళి వరండాలో వేశాడు. విశ్వనాథరావు బెడ్ మీద నుంచీ కిందకు దిగాడు. ఒక్కసారిగా కళ్లు తిరిగినట్లయింది. గోడపట్టుకుని నిలబడ్డాడు. ఒంట్లో జవసత్వాలన్నీ లాగేసినట్లు నీరసంగా ఉంది.

పసిపిల్లాడు తప్పటడుగులు వేస్తున్నట్లు చిన్నగా నడుస్తూ వరండాలోకి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"భోజనంలోకి ఏం చెయ్యమంటారయ్యా!" రంగయ్య వచ్చి అడిగాడు. "ఏమీ వద్దు బ్రెడ్ ఉందిగా! ఆకలి లేదు. పాలు కాచి ఫ్లాస్క్‌లో పోసివెళ్లు చాలు" అన్నాడు.

రంగయ్య చకచకా చెప్పిన పని ముగించి "నేనింక వెళతానయ్యా" అన్నాడు. విశ్వనాథరావు తలూపాడు. రంగయ్య లిఫ్ట్ దగ్గరకు వెళ్ళి, గేటు వేసి బటన్ నొక్కాడు. లిఫ్ట్ కిందకి వెళ్లింది.

రంగయ్య వెళ్లిన తర్వాత ఆ పరిసరాలు మరింత నిశ్శబ్దం అయ్యాయి. ఈ అపార్ట్‌మెంట్‌లో ఉన్న పది అంతస్తులలో సుమారు ముప్ఫైకి పైగానే కుటుంబాలు ఉన్నాయి. కానీ ఎవరిలోకం వారిది. ఎదురు పడ్డా పలకరించుకోరు. తలుపులు మూసుకుని లోపల టి.వి.తోనో, కంప్యూటర్‌తోనో కాలం గడుపుతూ ఉంటారు. అంతమంది మధ్య ఉన్నా ఆయనకు ఒంటరితనమే! అసలు జీవితమే ఒంటరి జీవితం.

విశ్వనాథరావు యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా చేస్తున్నాడు. ఇంకో రెండు సంవత్సరాలుంటే రిటైర్ అవుతాడు. భార్యపోయి ఆరేళ్లు అయింది. పిల్లలు లేరు. కానీ పిల్లలు లేరని ఏనాడు బాధపడలేదు. తమ్ముడి పిల్లలు, చెల్లెలి పిల్లలే తన పిల్లలు అనుకున్నాడు. వాళ్ళు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడు ఫ్రిజ్ నిండా కూల్‌డ్రింక్ బాటిల్స్, ఐస్‌క్రీమ్స్, పళ్ళు, చాక్లెట్లతో నింపేవాడు. వాళ్ళు స్వంత ఇంట్లోలా ఇష్టమైనవన్నీ తీసుకుని తినేవాళ్ళు.

చెల్లెలయితే సంవత్సరానికి పదినెలలు తన ఇంట్లోనే ఉండేది. తను ఏనాడూ అభ్యంతరం చెప్పలేదు. ఆడపిల్లకి పుట్టింటి మీద ఆశ ఉండటం సహజం అనుకున్నాడు. మేనకోడళ్ళకి ఎన్నెన్నో నగలు చేయించాడు? ఎన్నెన్నో బట్టలు కొన్నాడు? ఇల్లు కట్టుకోవటానికి డబ్బు చాలకపోతే ఎంతో డబ్బు ఇచ్చాడు! వేలు కాదు లక్షలే! ఎంత ఇచ్చాడో లెక్క కూడా చూసుకోలేదు. తన వాళ్లే కాదా అనుకున్నాడు. కానీ చెల్లెలు ఏమన్నది? 'చెడి చెల్లెలింటికి రావటం కన్నా చెరువులో పడి చావటం మేలు' అన్నది.

ఆలోచిస్తున్న విశ్వనాథరావు గుండె కలుక్కుమన్నది. ఇన్ని నెలల తర్వాత కూడా ఆ మాట గుర్తొస్తే గుండెల్లో పొడిచినట్లే అనిపిస్తుంది. తను చెడింది ఏంది? పెద్ద చదువు, మంచి హోదా, చేతినిండా డబ్బు అన్నీ ఉన్నాయి. లేని దొక్కటే, నా అనేవాళ్లు అభిమానం, ఆదరణ. ఆ ఆదరణతో కూడిన పలకరింపుకోసం, రవ్వంత అభిమానం కోసం చెల్లెలి దగ్గరకు వచ్చాడు.

ఏమాటకి ఆ మాటే చెప్పుకోవాలి. చెల్లెలికి తమ్ముడికి ఎంత డబ్బు ఇచ్చినా, వాళ్ళు ఎన్నాళ్లు మకాం వేసినా తన భార్య ఏనాడు అభ్యంతరం చెప్పలేదు. భర్త ఇష్టమే తన ఇష్టమనీ, భర్త లేకపోతే జీవితమే లేదని నమ్మే పాతతరం ఇల్లాలు. ఆమె ఉన్నంత కాలం సుఖంగానే గడిచింది. ఆమె పోయిన తర్వాత ఒంటరితనం మరీ ఎక్కువైనట్లు ఉంది.

అప్పుడప్పుడు చెల్లెలి పిల్లలతో సంతోషంగా గడుపుతామని వచ్చేవాడు. రెండు రోజులు భోజనం పెట్టడానికి కూడా చెల్లెలు బద్ధకించేది. ఇంటి పక్కన సందులో నిలబడి గోడవతల పక్కింటి ఆమెతో "మా విస్సుగాడికి సిగ్గూ, శరం లేదు సుశీలా! పెళ్లయి ఇరవై ఏళ్లయిన నన్ను వదలటం లేదు. వండి, వార్చలేక చచ్చిపోతున్నాను అనుకో! అరవచాకిరీ!" అనేది.

ఆ మాటలు ఇవతల గదిలో పడుకున్న తనకు వినపడుతూనే ఉన్నాయి. వినకూడదని జాగ్రత్తపడితే కదా వినకపోవటానికి. వినాలనే అన్నదేమో! ఇన్నాళ్లూ తను చేసిన మంచి అంతా మర్చిపోయింది. ఆ మాటకు వస్తే ఈ ఇల్లు తన డబ్బుతో కట్టింది కదూ! ఒకటీ రెండు రోజులుంటే ఏమైంది? ఆ మాత్రానికే బరువైపోయాడా? ఇక ఆ ఇంట్లో ఉండబుద్ధి కాలేదు. లేచి వచ్చేశాడు.

తమ్ముడు చెల్లెలిలాగా బయటపడడు. నోటితో ఏమీ అనడు. అన్నీ చేతలలోనే చేసి చూపిస్తాడు. తమ్ముడి కొడుకు వంశీని ఎంత ప్రేమగా చూశాడు? 'పెద్దనాన్నా' అన్న పిలుపులోనే "నాన్నా' అనే పిలుపు వెతుక్కుని కన్నబిడ్డలా చూసుకున్నాడు. 'సంపాదించేదంతా దాచుకుని ఏం చేసుకుంటాను? వీడు మాత్రం నా బిడ్డ కాడా!" అని చదువుకయ్యే ఖర్చంతా పెట్టుకున్నాడు. కానీ తమ్ముడు, కొడుకుని తన దగ్గరకి సంవత్సరానికి ఒక్కసారి కూడా

నువ్వెళ్లేదేవిటి బోడిది పోస్టుకార్డు వెడుతుంది -అన్న సూర్యకాంతం మాటలు జ్ఞాపకం చేసుకోండి!

కార్డు ముక్క : అప్పుడు అవసరం... ఇప్పుడు జ్ఞాపకం



మనదేశానికి స్వాతంత్ర్యం రాక మునుపు.. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులు, స్నేహితులకు ఏదైనా సమాచారం పంపాలంటే... పోస్టు కార్డులే దిక్కు. తొలినాళ్లలో వీటిని ఏనుగులు... గుర్రాలు... ఒంటెలపై ఒక ప్రాంతం నుంచి మరో చోటికి బట్వాడా చేసేవారు. కాలక్రమంలో మార్పులకు అనుగుణంగా రైళ్లు, బస్సులు, విమానాల్లో కూడా వీటిని చేరవేస్తున్నారు. 1861 నాటికి దేశవ్యాప్తంగా 889 పోస్టాఫీసులు ఉండేవి. వీటి ద్వారా 4.3 కోట్ల ఉత్తరాలు, 45 లక్షల వార్తా పత్రికలు బట్వాడా అయ్యేవి. స్వాతంత్ర్యం వచ్చేనాటికి వీటి సంఖ్య 23,344కు చేరింది. అదే 2011 మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా 1,54,866 పోస్టాఫీసులు ఉంటే.. వాటిలో సుమారు 5,66,000 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. పోస్ట్... అంటూ సైకిలుపై వచ్చి మన ఇంటి దగ్గర ఉత్తరాలు ఇచ్చి వెళ్లే పోస్ట్‌మ్యాన్ మనకు ఇప్పటికీ కనిపిస్తూనే ఉంటారు. ఒకప్పుడు మంచి, చెడు, పెళ్లి.. పేరంటం, చావు.. పుట్టుక ఇలా రకరకాల విషయాలు చేరేది ఈ 'కార్డు ముక్క' ద్వారానే. సాధారణ సమాచారం పంపాలంటే పోస్టు కార్డులు.. కీలక సమాచారం కొంచెం భద్రంగా పంపాలంటే ఇన్‌ల్యాండ్ లెటర్లు ఉపయోగించేవారు. లేఖలను పంపాలంటే ఇన్‌ల్యాండ్ కవర్లు అందుబాటులో ఉండేవి. 1990 తర్వాత రిజిస్టర్‌పోస్ట్, ఎయిర్‌మెయిల్, స్పీడ్‌పోస్టు, కొరియర్ వంటివి అందుబాటులోకి వచ్చాయి. వీటి హవా కొన్నాళ్లు నడిచింది. ఇప్పుడంతా స్పీడ్‌యుగం. కొత్త పుంతలు తొక్కుతున్న టెక్నాలజీ దూరాన్ని చెరిపేసింది. దీంతో ఉత్తరాలు క్రమంగా కనుమరుగైపోతున్నాయి. ఈమెయిల్స్ ద్వారా సమాచారాన్ని పంపడం తేలికైపోయింది. మనం ఏ క్షణంలో ఏం చేస్తున్నామో.. తక్షణం సుదూర ప్రాంతంలో ఉన్న స్నేహితులు, బంధువులకు ఈమెయిల్ ద్వారా క్షణాల్లో చేరవేయవచ్చు అవసరమైతే వారితో నేరుగా చాట్ చేయవచ్చు. దీంతో పోస్టు కార్డు.. ఇన్‌ల్యాండ్ లెటర్లు.. పాత జ్ఞాపకాలుగా మిగిలిపోతున్నాయి.

మూకీగా వచ్చిన సినిమా టాకీగా మారింది!

వివిధ భాషల్లో ఏటా వెయ్యికిపైగా సినిమాలను నిర్మిస్తూ 300 కోట్ల పైచిలుకు ప్రేక్షకులను థియేటర్లకు ఆకర్షిస్తున్న ఘనత భారతీయ సినీ రంగానిది. ఆదాయం లెక్కల సంగతి పక్కనపెడితే, ఈ రకంగా మనది ప్రపంచంలోని అతి పెద్ద వినోద పరిశ్రమ. స్వాతంత్ర్యం అనంతరం ఈ ఏడు దశాబ్దాల్లో భారత సినీ పరిశ్రమలో వచ్చిన నిర్మాణ, సాంకేతిక పరిణామాలు అనేకం. 1913లో దాదా సాహెబ్ ఫాల్కే తీసిన మూకీ 'రాజా హరిశ్చంద్ర తొలి స్వదేశీ కథాకథనాత్మక చిత్రం. అప్పటి నుంచి 1931లో తొలి భారతీయ టాకీ 'ఆలమ్ ఆరా' వచ్చేదాకా అన్నీ మాటలు లేని సినిమాలే. 1940 తొలినాళ్ల దాకా చిత్రీకరణ సమయంలో నటిస్తూ నటీనటులు స్వయంగా పలికిన మాటలు, పాటలనే ఫిల్మ్‌పై రికార్డ్ చేసేవారు. ఆ తరువాత డైలాగుల్ని విడిగా రికార్డు చేసే డబ్బింగ్ ప్రక్రియ, ప్లేబ్యాక్ సిస్టమ్ వచ్చేశాయి. ఇప్పుడు మళ్లీ సెట్‌లో నటిస్తున్నప్పుడే డైలాగులు కూడా రికార్డు చేసే పద్ధతి 'సింక్ సౌండ్' పేరుతో ప్రాచుర్యంలోకి వచ్చింది. నాడు షూటింగ్ అంటే బండ బరువుండే డెబ్రీ, మిచెల్ తరహా కెమేరాలతోనే! నేడు బరువు తక్కువ యారీఫ్లెక్స్ కెమేరాలు, ఒంటికి తగిలించుకునే 'స్టెడీకామ్'లు వచ్చాయి. స్వాతంత్ర్యం తర్వాత 35 ఎం.ఎం. నుంచి సినిమా స్కోప్, 70 ఎం.ఎం., ఆపైన అద్దాలు పెట్టుకుని చూసే 3డీ సినిమాలు తయారయ్యాయి. డాల్బీ, డీటీఎస్, డాల్బీ ఎట్మాస్‌ల పేరిట సౌండ్ ఎఫెక్టులూ అదిరిపోతున్నాయి. అప్పట్లో సినిమాను ముడి ఫిల్ముపై చిత్రీకరించేవారు. ఎన్ని థియేటర్లలో సినిమా ప్రదర్శించాలంటే అన్ని ప్రింట్లు తీయాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఫిల్ము అక్కర్లేదు...హార్డ్ డిస్క్ ఉంటే చాలు. డిజిటల్ చిత్రాన్ని శాటిలైట్ ద్వారా థియేటర్లకు పంపి, ప్రొజెక్టర్ల ద్వారా ప్రదర్శిస్తున్నారు. నాడు ఊరూరా తిరుగుతూ, డేరాలు వేసి సినిమాలు ప్రదర్శించేవారు. టాకీలొచ్చాకా టూరింగ్‌టాకీస్‌లే ఎక్కువ. క్రమంగా పర్మినెంట్ థియేటర్లు వచ్చాయి. 1927లో 309 హాళ్లుంటే... 1947లో సుమారు 2 వేల థియేటర్లుండేవి. ప్రస్తుతం మల్టీప్లెక్సులు, ఐ-మ్యాక్సులు... వెరసి దేశంలో నేడు 14 వేల స్క్రీన్స్ ఉన్నట్లు అంచనా.

పంపించేవాడు కాదు. ఎప్పుడు అడిగినా ఒకటే సమాధానం "వీలు కాదు, బిజీ" అనీ ఇంజనీరింగ్‌లో చేరిన తర్వాత ఎవరూ చెప్పకుండా వంశీనే దూరంగా ఉండేవాడు. ఏనాడు తనంత తను పలకరించడు. ఫోన్ కూడా చెయ్యడు. తనే చూడటానికి వెళితే ఇంట్లో ఉండడు.

చిన్నప్పుడు తల్లి, తండ్రీ, మేనత్త ఒక్కొక్కరే కాలం చేసినప్పుడు 'అమ్మా, నాన్న, అత్తయ్య మొదలైన పిలుపులన్నీ మర్చిపోవాల్సి వస్తుంది' అని బాధపడేవాడు. ఇప్పుడు తమ్ముడు, మరదలు, వంశీ అందరూ ఉన్నా ఆ పిలుపును కూడా మర్చిపోవాల్సి వస్తుంది. ఈ మాట అనుకోవటానికి కూడా మనసొప్పటం లేదు.

ఆలోచిస్తూ వరండాలో కూర్చున్న విశ్వనాథరావు చీకటిపడటం, బయట లైట్లు వెలగటం గమనించలేదు. చిన్నగా లేచి లోపలికి వచ్చాడు. లైటు వేశాడు. టేబుల్ మీద టాబ్లెట్లు తీసుకుని నోట్లో వేసుకుని మంచినీళ్లు తాగాడు. మంచం మీద పడుకున్నాడు.

రెండు రోజుల నుంచీ జ్వరం. అనారోగ్యంగా ఉన్నప్పుడు మనసు ఆత్మీయుల కోసం మరింత తపించిపోతుంది. తమ్ముడు, చెల్లెలు, వాళ్ళ పిల్లలు అందరూ వచ్చి ఇల్లంతా సందడితో నిండిపోతే ఎంత బాగుంటుంది? కానీ అది అసంభవం.

ఆడవాళ్ల చీరల రెపరెపలు, గాజులు గలగలలతో, చంటి పిల్లల ఏడుపులతో, మగవాళ్ళ నవ్వులతో ప్రతిధ్వనించని ఇల్లు ఇల్లే కాదు. విశ్వనాథరావుకి ఆ ఇల్లు మరింత నిశ్శబ్దంగా, భయంకరంగా అనిపించసాగింది.

తెల్లవారింది. విశ్వనాథరావు కాలకృత్యాలు తీర్చుకుని, ముఖం కడుక్కుని డోర్‌లాక్ చేసి లిఫ్ట్ దిగి కిందకి వచ్చాడు. ఎదురుగా ఉన్న హోటల్‌లో రెండు ఇడ్లీలు తిని, 'టీ' తాగాడు. కొంచెం ఓపిక వచ్చినట్లయింది. ఇలా ఆరుబయటకు వచ్చి నడుస్తూంటే ప్రాణం తేరుకున్నట్లు ఉంది.

హాస్పిటల్‌కి వచ్చాడు. డాక్టర్ ఆయన్ని చూసి "కబురంపితే నేనే వచ్చి ఉండేవాడిని కదా! మీరు శ్రమపడి రావాలా?" అన్నాడు.

"ఇంట్లో కూర్చుని, కూర్చుని పిచ్చెక్కి పోతూంది. బయటకు వచ్చి నలుగురు మనుషుల్ని చూస్తే కాలక్షేపంగా ఉంటుందని వచ్చాను" అన్నాడు విశ్వనాథరావు.

డాక్టర్ మాట్లాడలేదు. టెంపరేచర్ చూసి "నార్మల్‌కి వచ్చింది. ఇంజెక్షన్ చేస్తాను. ఈ టానిక్ వాడండి. నీరసం కూడా తగ్గిపోతుంది" అని ఇంజక్షన్ చేసి, ప్రిస్క్రిప్షన్ రాశాడు.

విశ్వనాథరావు వెళుతున్నానని చెప్పి బయటకు వచ్చాడు. వెంటనే తిరిగి ఇంటికి వెళ్ళాలనిపించలేదు. నిదానంగా అడుగులు వేస్తూ నడవసాగాడు. ఆకాశం మబ్బుగా వుంది. మనసూ మబ్బుగా ఉంది. చల్లటి గాలి వీస్తోంది. ప్రయాణిస్తున్నాడు. జీవం ఉన్న వరకూ పయనించాలంటే నడుస్తూనే ఉండాలి. ●

తరతరాలుగా వస్తున్న తాత్విక చింతనను తాకట్టు పెట్టాం!

భిన్న సంస్కృతీపరులున్న భారతదేశ వాసులు ఒకే జాతి! ఒకే దేశం! ఒకే కుటుంబం! ఒకటిగానే జీవించాలనే సుస్థిరాభివృద్ధికి గండికొట్టాం!

భారత సంస్కృతి విశ్వజనీన ప్రగతిని కోరే సంస్కృతి! విభిన్న భాషలవారు! విభిన్న సంస్కృతివారు! వివిధ జాతులవారూ వసుధైక కుటుంబీకుల మనే భావనతో ఏకదేశంగా ఏక కుటుంబంగా వర్ధిల్లాలని వనరులను, వనాలను అభివృద్ధిపరచు కోవడంలో ఒక్కొక్కరు వారు వేరు అన్న భావనను వేళ్లూనకుండా చేసుకున్నారు.

బంగారు భవిష్యత్‌కు పృథ్వివంటి ప్రభువులు భారతదేశాభివృద్ధికి పునాదులు వేసారు. సగరుడు వంటి చక్రవర్తులు పృథ్వీవేసిన బాటలను జనైక ఆరామాలుగా తీర్చిదిద్దారు.

శ్రీరాముడు రాజ్యానికి వచ్చిన అనన్తరమ్ సుభద్ర జీవనానికి పునాదులు వేసింది రామరాజ్యం. సుక్షుభిత స్థితిని సమ్మూలంగా మాన్పివేసింది. జనులు ఘర్షణాత్మంగా గానీ, వరంగా గానీ వేర్పాటు భావకులు కాలేదు. క్షుద్బాధా పీడితులుగా లేరు. వివిధ వృత్తులలో వృత్తి నైపుణ్యంతో ఒక ఆదర్శ సామ్రాజ్యం వర్ధిల్లింది. జాతిపిత గాంధీగారు స్వాతంత్ర్యం సిద్ధించిన భారత దేశం 'రామరాజ్యం' వంటి ఆ ఆదర్శ గ్రామరాజ్యంగా వర్ధిల్లాలని భావించారు. కలలుగన్నారు.

రామరాజ్యంలో అందరికీ అందరూ! అందరూ అందరికి. అనే స్వామ్య సిద్ధాంతంతో ఒకే కుటుంబంగా మెలిగారు.

విశ్వ కుటుంబం భావన. అప్పుడే ఉదయించింది. భారత దేశం భరతఖండముగా వర్ధిల్లింది. వసుధైక కుటుంబ భావనం అప్పుడే కుసుమించినదే.

ఈనాటి ప్రజాస్వామ్యం ఆనాటి ప్రజాసౌజన్యానికి అనువుగా తీర్చిదిద్దిగల ప్రతిభావంతులు ఉంటే భారత దేశం స్వర్ణభారతదేశమవుతుంది.

భరతఖండం పౌరుల్లో, పౌర నాయకుల్లో 10 శాతం మంది సత్యశీలురున్ననూ చాలు, పూర్వపుటౌన్నత్యాన్ని పునర్భవింపచేయగలుగుతారు.

చెట్లను నరుకుతూ, కొండలను పిండి చేస్తూ, పంటపొలాల్ను, చేపల చెరువులుగా మారుస్తున్నంత కాలమూ పౌరునికి తినే తిండి కట్టే గుడ్డా, వాసయోగ్యమైన గూడు లేకుండా పోయే ప్రమాదాన్ని ప్రజానాయకులు కొని తేరని ఆశిద్దాం. భారత ప్రధాని కలలుగంటున్న స్వచ్ఛ భారత్ నిర్మాణంలో మనమూ కలిసినడుద్దాం మన దేశభవిష్యత్ మన చేతుల్లోనే ఉందనీ, అందుకై అహర్నిశలూ కృషి చేయాలని 2017 ప్రారంభం నుంచే ప్రతిన పూనుదాం. మన ముందున్న గోముఖవ్యాఘ్రాలను తరిమేద్దాం. ●

తొలి తెలుగుకథానిక

తెలుగు సాహిత్య వికాసం మహా భారతం ఆంధ్రీకరణంలో ప్రారంభమైందంటారు. కానీ అది అనువాదమే. గురజాడ అప్పారావు గారు రచనల్ను ప్రారంభించి, తొలి కథగా 'దిద్దుబాటు' కథను వ్రాశారనీ, ఆ కథ 1910 సంవత్సరంలో ప్రచురితమైందనీ చెబుతారు. కానీ శ్రీ గురజాడ కన్నా ముందుగా ఆచంట వేంకటసాంఖ్యాయన శర్మగారు 'లలిత' అనే కథను వ్యావహారిక భాషలో వ్రాశారనీ, ఆ కథ 'కల్పలత' అనే పత్రికలో ప్రచురితమైందనెడి ఒక వాదన ఉంది.

ఏది ఏమైనప్పటికినీ తెలుగులో సాహిత్యం రెండు పట్టాల మీద నడిచే రైలు బండిలా అటు సాంప్రదాయ సంస్కృతీ అనువాద సాహిత్యమూ, ఇటు వ్యావహారిక భాషా సాహిత్యమూ తెలుగు నాట వెలుగుల్ని నింపాయనెడి 'సత్యం' అవగతమవుతూనే ఉంది.

అనువాద సాహిత్యాల్లో కూడా చెకోవ్, గోర్కీలా వంటి రష్యను రచయితలు రచనలను, పలు తెలుగు రచయితలు, తెలుగులో నాటకాలుగా కథానికలుగా రచించడం, వాటిని ఔత్సాహిక కళాకారులు ప్రదర్శించడం జరిగింది. అనువాద సాహిత్య శ్రేణిని హిమవత్పర్వత శ్రేణంత ఎత్తుకు సాగిన దాఖలాలున్నాయ్. దీనికంతటికీ ముఖ్య కారణం తెలుగువాడు ప్రపంచశ్రేణి పౌరుడు కావడమే! ఆ స్థాయికి తెనుగుతనాన్ని కూడా తీసుకువెళ్ళి వుంటే, తెలుగు భాష ప్రపంచ భాషయై, ఆంగ్ల భాషా స్థాయికి చేరుకొనేది! కానీ విశ్వసాహిత్యాన్ని విశద పరుద్దామనే సహృదయధోరణిలో స్వభాషా ప్రచార కృషిని ఆనాడు గానీ యీనాడు గానీ ఎవరూ అంతగా చేయకపోవడం నేరమనే చెప్పాలి! అయితే మనం దీనిని తెలుగువాడి హృదయం విశాల హృదయంగా పేర్కొంటున్నాం. తొలి తెలుగు కథానిక అచ్చతెలుగు కథానికగ వచ్చినందుకు ఆనందిస్తున్నాం. ●

వందే! పాలయమాం 2017 సంవత్సర పాహిమాం!

పాహిమాం వందే! పాలయమాం శ్రీహరి- దేహిమాం అనుగ్రహం - వరదాయి నిరంతరం

ఓం కేశవనారాయణ- నమో మాధవ గోవింద - విష్ణు మధుసూధన- త్రివిక్రమవామన శ్రీధర

ఓం ఋషీకేశ పద్మనాభ దామోదర సంకర్షణ - వాసుదేవ ప్రద్యుమ్న అనిరుద్ధ పురుషోత్తమ

ఓం అధోక్షజ - నారసింహ- అచ్యుత - జనార్ధన- ఉపేంద్ర- హరయే! శ్రీకృష్ణాయ- నమః పాహిమాం

కృతయుగావతారాయ- దశావతారాయ- సత్యధర్మ శాంతి వేద రక్షణ కారణాయ

త్రేతాయుగావతారాయ- శ్రీరామచంద్రాయ - జనజీవన మార్గదర్శక - శుభప్రదాయ

ద్వాపర యుగావతారాయ- శ్రీకృష్ణాయ - దైత్య హరణ కాళింగ మర్ధన- గోరక్షకాయ

కలియుగావతారాయ- కలియుగేశాయా - మాసంచిత పాపకర్మలను- పోద్రోలవయ్యా పాహిమాం

ఆయురారోగ్య- యశోభాగ్యం- దేహిమాం - ఆనంద- సుఖప్రద - జీవనం -దేహిమాం

సర్వకార్యాలలోని విజయం దేహిమాం- ఉన్నతోన్నతస్థితియుత ఆశీః సేవలు దేహిమాం

తత్తరపాటు లేని - చిత్తం - దేహిమాం- సత్సంకల్ప- సిద్ధిని కలిగించే - వాక్సుద్ధి- దేహిమాం

హృదయాన విష్ణుపాదాలు నిల్పుస్మరణదేహిమాం - నిత్యం పాదాల భజించయ భక్తిదదామ్యహం పాహిమం

శుభంభూయాత్

– విద్వాన్ కోట **శ్రీరామచంద్రమూర్తి**, విల్లివాక్కం, చెన్నై-49



అమెరికా పిల్లలకు అమ్మ భాష నేర్పండి!

ఇంట్లోని వస్తువుల మీద ముద్రించిన తెలుగు అక్షరాలను నిత్యమూ కళ్లతో చూస్తూ, కూల్‌స్లేట్ అనే యాప్‌లో దిద్దుకుంటే తెలుగును సులభంగా నేర్చుకోవచ్చు అంటున్నారు అమెరికాలోని కొల్లు రంజిత్.

"అమెరికాలోని పిల్లలు తెలుగునేర్చుకోవడమో పెద్ద ప్రయాస. పిల్లలకు ఎదురవుతున్న ప్రధాన సమస్యలు రెండు. ఇక్కడ మాతృభాష మాట్లాడే వాతావరణం లేకపోవడం. రెండు- అందుకు తగ్గ సంస్కృతికి దూరంగా పెరగడం. ఇంట్లోని పెద్దలేమో మాతృ భాష నేర్చుకోమని పిల్లల్ని ఒత్తిడికి గురిచేస్తుంటారు. అయితే వాళ్లకు మాతృభాష మాత్రం రాదు.



మా ఇంట్లోని పిల్లలదీ ఇదే సమస్య. తెలుగు భాషను సులభంగా నేర్చుకునేందుకు ఇప్పటికే ఎన్నో మార్గాలు ఉన్నాయి. అమెరికాలోని శిశుభారతి అనే భాష అధ్యయన కేంద్రాలకు పిల్లల్ని పంపిస్తున్నాము. అది వారానికి ఒకసారి మాత్రమే ఉంటుంది. మళ్లీ ఆ అవకాశం అది వారానికి గాని రాదు. కేంద్రానికి వెళ్లేవరకు తెలుగు వైపు పిల్లలు కన్నెత్తి చూడరు. దాంతో తెలుగు అక్షరాలను మరచిపోతున్నారు. నేను గమనించిన సమస్యనే మా మిత్రులు కిరణ్, వెంకట్‌లు పసిగట్టారు. వీళ్ళిద్దరూ నాతోపాటు గన్నవరంలో చదువుకున్నారు. నేను యూఎస్‌లో ఎంఎస్ చదువుకుని అక్కడే స్థిరపడ్డాను. వెంకట్ ఐఐఎం పట్టభద్రుడు. కిరణ్‌కూడా ఎంఎస్ చదువుకుని ఉద్యోగం చేస్తున్నారు. మేము ముగ్గురం ప్రస్తుతం ఐటి రంగంలో ఉంటున్నాం. అమెరికాలోని పిల్లలకు తెలుగు భాష సులువుగా రావాలంటే ఏం చేయాలని ఆలోచించాం. ప్రపంచంలోని భాష అధ్యయన పద్ధతులను పరిశీలించాం. అప్పుడు మాకొక ఆలోచన తట్టింది. అదే 'విజువల్ లర్నింగ్'.

ఆయన ఇంటి నిండా అక్షరాలే...

రోజు కళ్ళతో చూసే దృశ్యాలను మెదడు సులువుగా అర్థం చేసుకుంటుంది. పదే పదే అలా చూస్తూ పోతే ఆ అంశం బాగా గుర్తుండిపోతుంది. దాన్నే 'విజువల్ లెర్నింగ్' అంటున్నాం. ఆన్‌లైన్‌లో నైపుణ్యవంతుల చర్చావేదిక టెడ్‌టాక్స్‌లో ఈ కాన్సెప్ట్ గురించి తెలుసుకున్నాం. తెలుగు అక్షరాలను కూడా ఇలా ప్రతిరోజు చూసి, తాకి.. అనుభూతి చెందే మార్గాన్ని పిల్లలకు అందిస్తే ఎలా ఉంటుంది అన్న ఆలోచన వచ్చింది. మేము ముగ్గురు మిత్రులం కలిసి ఆ ఐడియాను విస్తరించాం. తెలుగు అక్షరాలను పిల్లలు ఒత్తిడి లేకుండా నేర్చుకోవాలి. అందులోను ఆడుతూ పాడుతూ ఆ పని చేయగలిగితే వాళ్ల మనసుకు నచ్చుతుంది. అలాంటి వస్తువులు ఆన్‌లైన్‌లో దొరుకుతాయేమోనని వెదికాం. ఎక్కడా కనిపించలేదు. రోజూ కాఫీ తాగే మగ్గులు, దుస్తులు, సోఫా కవర్లు, సెల్‌ఫోన్ కవర్లు, బ్యాగులు, పర్సుల మీద అక్షరాలను ముద్రించాము. అవన్నీ ఇంట్లో నిత్యం పిల్లలకు కనిపించేవే! రోజూ ఆ వస్తువులను వాడే క్రమంలో అప్రయత్నంగా తెలుగు అక్షరాలను చూస్తారు. దాంతో భాషతో ఒక బంధం ఏర్పడుతుంది. ఆ బంధం భాషా మాధుర్యాన్ని చవిచూడాలన్న తపన కలిగిస్తుంది అన్నది మా ఉద్దేశం. వస్తువుల మీద మేము ముద్రించిన అక్షరాలను చేతిరాతతో రాయించాము. సులభంగా ఆకట్టుకునేలా... సున్నితమైన రంగులతో పొదిగాము. ముందుగా మా ఇళ్లలోని పిల్లలకు వాటిని అలవాటు చేశాక అద్భుతమైన ఫలితం వచ్చింది. పిల్లలు రెండు మూడు రోజుల్లోనే తెలుగు అక్షరాలను అలవోకగా నేర్చుకున్నారు. చాలామంది పిల్లలు మా వస్తువుల్ని ఉపయోగిస్తున్నారు. ఇది మన తెలుగు అని గర్వంగా భావిస్తుండటం విశేషం.

నేడు ఎవరింట్లో పిల్లలను చూసినా స్మార్ట్‌ఫోన్లు, ఐపాడ్‌లు, టాబ్‌లు వాడేస్తున్నారు. వాట్సప్‌లాంటి యాప్‌లు అయితే తెలియని వారు ఉండరు. ఇలాంటి మార్గాల్లో తెలుగు భాషను నేర్చుకోవడానికి మేము కనుక్కున్న ఉపాయం 'కూల్ స్లేట్' ఇది వాట్సప్‌లాగే పనిచేస్తుంది. పిల్లలు, టీచర్లు కలిసి గ్రూప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందులో పిల్లలు తెలుగు అక్షరాలను అచ్చం పలకలో రాసినట్లే రాసి... అవతలి వాళ్ళకు పంపొచ్చు. అది సరిగ్గా రాశారా లేదా అన్నది వాళ్లు చూస్తారు. తప్పులుంటే సరిదిద్ది పంపిస్తారు. ఒక రకంగా భాషను నేర్చుకునేందుకు ఇంటరాక్షన్ వంటిదన్నమాట. 'అ ఆ'లను ఈయాప్‌లో దిద్దుకుని నేర్చుకోవచ్చు. పిల్లల్లో ఇది చాలా ఆసక్తిని రగిలిస్తుంది. అత్యంత వేగంగా తెలుగు అక్షరమాలను నేర్చుకోగలుగుతారు. ఆండ్రాయిడ్ మొబైల్లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వాడుకోవచ్చు. దీన్నిలా విడుదల చేస్తున్నాం. విదేశాల్లోని తెలుగు పిల్లలు మాతృభాషకు దూరం కాకుండా మా వంతు చేస్తున్న చిన్న ప్రయత్నం మంచి ఫలితాన్నియిస్తుందని ఆశిద్దాం. ●

వృక్షాలింగనం

- డా॥ సి. నారాయణరెడ్డి

ముందుకు చూస్తే
పలుకరిస్తున్న పచ్చని చెట్టు
కొమ్మల చేతులతో అది
స్వాగత ముద్రలు పడుతున్నది
ఉత్తేజమున్న ఏ హృదయానికైనా
ఆ చెట్టును
ఒత్తుగా కౌగలించుకోవాలనిపిస్తుంది
చెట్లును ఆలింగనం చేసుకుంటే
కొమ్మలు నిలువెల్లా కుసుమిస్తాయి!
పూలకింద వున్న మొగ్గలు
ప్రపూర్ణంగా వికసిస్తాయి!
వికాసమే తమ అకళంక లక్ష్యంగా
వాతావరణ గళంలో
పురోగమన శ్రుతులు వినిపిస్తాయి!

జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

కష్టపడి పనిచెయ్యండి. మీ గమ్యాన్ని చేరుకుంటారు.

- స్వామి వివేకానంద

అన్నదమ్ములు అన్యోన్యంగా ఉంటే తల్లి తనువంతా ఆనందంతో నిండిపోతుంది!

అన్నదమ్ములు అన్యోన్యంగా ఉండాలి! ఐకమత్యంగా ఉండాలి! అనుకూలంగా ఉండాలి!

బాల్యం నుంచీ రామలక్ష్మణ భరతశతృఘ్నులు ఎంతో సఖ్యంగా ఉండేవారు. వారు నలుగురూ బంతి ఆట ఆడుకుంటున్నారు. కొంతసేపయిన తరువాత రాముడెంతో అలసిపోయాడు. చెమటలు కార్చుకుంటూ తల్లి కౌసల్య వొడిలో తలపెట్టి నడుమువాల్చాడు. అలసిపోయినా కానీ ఆనందంగా ఉన్నాడు.

తల్లి కౌసల్య శ్రీరాముని మోములోని ఆనందం చూచి- ఇంత శ్రమపడి, చెమటలు కార్చుకుంటూ వచ్చావు. కానీ నీ ముఖంలో ఆనందమే కనిపిస్తున్నది ఏఁవిటి రామా విశేషం అని అడిగింది.

అమ్మా! ఈనాటి బంతి ఆటలో భరతుడు గెలిచాడమ్మా- సంతోషంగా చెప్పాడు.

మరి కొంతసేపటికి భరతుడు దిగాలుగా వచ్చాడు. ఏం నాయనా విచారంగా ఉన్నావు గెలిచినందుకు చాలా ఆనందంగా ఉండాలి! ఆ విచారం ఏఁవిటి? అని అడిగింది కౌసల్య.

అమ్మా! నేను ఓడిపోయే పరిస్థితిలో నన్ను గెలిపించాలని అన్న రాముడు కావాలని ఓడిపోయాడమ్మా! నా విజయానికై అన్న ఓడిపోవడం నాకు చాలా బాధగా ఉందన్నారు.

ఈనాడు అన్నదమ్ములలా సుప్రీం స్టేజికి వెళ్లడం లేదు. సుప్రీం కోర్టు వరకూ వెడుతున్నారు.

ఇదెంత ఆశ్చర్యంగా ఉంది- ఎంత హాస్యాస్పదంగా ఉన్నదో అన్నారు భగవాన్ శ్రీశ్రీ సత్యసాయిబాబా! నిజమే ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ యెలా ఛిన్నాభిన్న మైందో- అలాగే కుటుంబాల అన్యోన్యత అవస్థలపాలైంది. అలాగే అనుబంధాలు కూడా అదృశ్యమవుతున్నాయ్.

మనిషి దూరమవుతున్నకొద్దీ మనసు కూడా దూరమవుతూంది. భారతదేశంలో వృత్తులవారీ కులాలు వృత్తి నైపుణ్యం, వృత్తిపాలనం కూడా ఏర్పడింది. ఏ వృత్తి కులమైనా, మరో వృత్తి కులంపై ఆధారపడవలసిన అవసరం ఏర్పరచారు. చిన్న చిన్న గ్రామాల పరిధిలో అన్ని వృత్తులవారూ మరికొన్ని వృత్తులవారి సహకారంతో జీవనం సాగించేవారు.

పెద్దరికం వహించేవారు, పేదవారి సహకారం లేకుండా మనుగడ సాగించలేకపోయేవారు. ఒక శుభ కార్యం వచ్చినా, అశుభం యేర్పడినా వృత్తి కులాల పరస్పర సహకారం ఉండేది. రామరాజ్యం గ్రామరాజ్యంగా పాలించడానికి నాంది పలికింది.

అన్నదమ్ముల మధ్య అన్యోన్యం, అభిమానం అవగాహనం ఆప్యాయత ఐకమత్యం లేకపోవడం వల్లనే కుటుంబ సమైక్యత దెబ్బతింటూంది!

కుటుంబం వర్థిల్లాలన్నా, ప్రవర్థిల్లాలంటే సమత, సమగ్రత, సౌభాత్రత వర్థిల్లాలి. అన్నదమ్ముల మధ్య అన్యోన్యత ప్రధానంగా ఉండాలి. వందమంది సోదరులు కౌరవులు వారికి దుశ్శల పేరుగల సోదరి ఒక్కరే ఉంది. వారు 101 మందీ జ్యేష్టభ్రాత దుర్యోధన పట్ల అత్యంత సోదర వాత్సల్యంతో ఉండేవారు అందరిదీ ఒకేమాట. పాండవులు అయిదుగురూ పాండురాజు పుత్రులు. వారు కౌరవుల పట్ల సోదరభావంతో ఉండేవారు. ధర్మరాజు ధర్మమూర్తి ఒకసారి ధర్మరాజు శ్రీకృష్ణునితో మాట్లాడుతున్న సందర్భంలో- కృష్ణా మాకు బయటవారితో పోరాట ఆరాటములేఁవి వచ్చినా మేము నూటయిదు మందీ ఒక్కటే అన్నాడు. అలా ధర్మరాజు అన్నదమ్ముల అన్యోన్యతకు నిదర్శనమూ ఆదర్శమూ!

అప్పటి భారతదేశములోని 47 కోట్ల హిందూ ముస్లిములూ అన్నదమ్ముల్లా అన్యోన్యమైత్రిలో ఉండబట్టే పాశ్చాత్యులను తరిమకొట్టగలిగారు. ఇప్పుడా అన్యోన్యత నూన్యతగా మారడం భారత ఉపఖండానికి శాపమైంది. ●

భవిష్యత్తుకు బంగారు బాట వేసే ప్రతిభాశీలురు కావాలి!

'మానిషా యానిషా అస్తి యేషాంత్ మానిషినః' అని చెప్పిన వేదాలే 'మానిష నాస్తు భవన్తి పావనాని నా భవన్తిః' యని చెబుతున్నాయ్. ప్రపంచంలో ఎంతో మంది తెలివితేటలూ, ప్రతిభా సామర్థ్యం కలవారున్నారు. కానీ వారంతా పవిత్రాత్మ కలవారూ, పొరుగులను పవిత్రంగా తీర్చిదిద్ద గలవారూ గాకపోవడంతో ప్రపంచ క్షేమానికి చేటు వస్తున్నది. భవిష్యత్తుకు బంగారుబాట వేద్దామనే అంతః కరణ లేకపోవడం వల్లనే ప్రమాదాలు పొంచి చూస్తున్నాయ్. సమస్యలను సృష్టించేవారున్నారే గానీ, సమస్యలను పరిష్కరించేవారు లేరు, ఆ చాతుర్యం వారికున్ననూ, స్వార్థ ప్రలోభాలకు లోనై, పరిష్కరించే ఆలోచనవంక తలెత్తి చూడడం లేదు.

భారతదేశంలో ప్రతిభాసామర్థ్యాలు కల రాజకీయ నాయకులు, మేధావులు, రచయితలు, శాస్త్రజ్ఞులు, పత్రికా రచయితలు, కళాకారులకు కొదువలేదు. కొందరు ఇతర దేశాలకు మన శాస్త్ర ప్రతిభాసంపత్తిని ధారపోసో, ఇతర దేశాలకు సేవ చేస్తూనో, స్వదేశాభ్యున్నతిని పట్టించుకోవడంలేదు.

కాశ్మీర్ భారతాంతర్భాగమని తెలిసి కూడా, కొంత భాగాన్ని కాజేసి ఆజాద్ కాశ్మీర్‌గా ఏర్పరచుకోవడం, మిగతా భాగాన్ని కూడా మ్రింగివేయాలని, వంతపాటను 52 ఏళ్లుగా పాడుతున్నవారికి చరము గీతం పాడకపోగా, కాశ్మీర్ నుంచీ ముస్లిమేతరులు వలసపోవడానికి కారకులయ్యారు. ఎందరో కాశ్మీర్ పండితులు ప్రాణాలు కోల్పోయినప్పటికినీ, మిత్ర దేశాలు గానీ, ఐక్యరాజ్యసమితిగానీ పన్ను మెదపలేదు. వరల్డు ట్రేడ్ సెంటర్ భవన విధ్వంసంపై సానుభూతిని చూపినంతగా ప్రపంచదేశాలు, కాశ్మీర్ అసెంబ్లీ, భారతపార్లమెంటుపై జరిపిన దాడులకు ప్రతిస్పందన లేదు. భారత్‌ను సంయమనం పాటించమనే ఈ దేశాలు, ఆఫ్ఘాన్‌స్థాన్‌పై వెంటనే విరుచుకుని పడడమెందుకు?

తమ తమ స్వప్రయోజనాలను వెనుకపెట్టి- భారత రాజకీయ నాయకులూ, మేధావులైన ఇతర రంగాల వారూ ఏకత్రాటిపై నడిస్తే, ఒక్క భారత భూభాగంలోనే కాదు. ఆ అపార ఐక్యశక్తితో ప్రపంచ దేశాలకే తలమానికం కావచ్చు, అయితే ఇదేదో ఒక పాలక పార్టీకీ, పేరుప్రఖ్యాతులు అందుతాయని మిగతావారంతగా వంత పాడడంలేదు. దేశ ప్రయోజనం కన్నా వారి స్వప్రయోజనమే వారికవసరం. దేశంలో ఇన్ని రాజకీయ పక్షాలుండడం కూడా దేశానికి నష్టాన్ని కలిగిస్తూంది. సెక్యులర్ ముసుగులో ఒక వర్గానికి అధిక ప్రాధాన్యం యివ్వడమే ఇందుకు కారణమయింది. ధర్మపరమైన భారతదేశంలో మత సంస్కృతులను పులుముతూ, ప్రజలను అయోమయ స్థితిలో పడవేస్తున్న వీరిని నాయకులనీ, పురుషులనీ అనగలమా? అనాలంటే వీరంతా ధైర్యంగా ఒక త్రాటిపై నిలిచి, ఒకేగళంతో, ధైర్యంగా దేశానికి బంగారు బాటలు వేయాలి, బంగారు భవిష్యత్‌ను కూర్చాలి, ఆ పనిని వారు చేయకపోతే- ప్రకృతి పరమైన ధర్మమే ఆ పనిని చేస్తుంది. అలాటి ప్రతిభాశాలురైన పురుషుల్ని ధర్మమే సృజిస్తుందని భావిస్తూ, సత్యం వద ధర్మం చర' అనే మార్గంలో ప్రజలు పొరపొచ్చాలు లేకుండా పయనించాలి. ఇదే నా వినతి. ●

అ ఆ
అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్ధ, వృద్ధ భారాన్ని మోస్తూనే
266 నెలలుగా
266 సంచికలను
శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।
ప్రముఖాంధ్ర
- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల ఱేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!
'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)
గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు
చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
February 2017

REGN. No. TN/CC(S)DN/177/15-17
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97